
# తల్లి ప్రేమంటే?

—వడ్లమూడి దుర్గాంబ

ఆ రోజు సాయంత్రం నిర్మలా, నేనూ కాలేజి నుండి ఇళ్ళకు బయలుదేరాం. ప్రతిరోజూ గలగలా పారే సెలయేరులా వాగే నిర్మల ఆ రోజు ముభావంగా వుండడం ఉదయం నుండి గమనిస్తూనే వున్నాను నేను.

కాలేజీలో మరే ఇతర స్టూడెంట్‌కీ లేని చనువు నిర్మలకి వుంది నా దగ్గర. ఇదివరకు అందరిలానే తనూ నేనంటే భయపడేది. కానీ నెల్రక్రితం నేను వాళ్ళింటి ముందింట్లోకి వచ్చినప్పటి నుండి, ఈ నెల రోజుల అనుబంధంతో మా మధ్య మంచి స్నేహ బంధం ఏర్పడింది. "మిమ్మల్ని చూస్తే ఎంతో రిజర్వుడుగా వుంటారేమోనని భయమేస్తుంది మేడమ్! మా ఫ్రెండ్సందరం అలాగే అనుకునేవాళ్ళం! కానీ మేమెంత తప్పుగా ఊహించామో యిప్పుడర్థమవుతోంది నాకు!" అంది ఓ రోజు నవ్వుతూ తను. నేనూ నవ్వి వూరుకున్నాను. తక్కువగా మాట్లాడే వారంతా లోకానికి రిజర్వుడు వ్యక్తుల్లా కనిపించడం సహజమేననిపించింది నాకు.

మెయిన్ రోడ్డు దాటాక ఎక్కువగా జనం తిరగని వీథిలో నడుస్తున్నప్పుడు అడిగాను నిర్మలని. "ఏం నిర్మలా అలా వున్నావ్?" అని. నిజానికి నేనడిగిన ప్రశ్నకి సమాధానం చాలా వరకు నాకు తెలిసినదే! కాని ఆ అమ్మాయిచేత మాటాడించాలనే తపన, ఆ తరువాత ఆ పిల్లను వూరడించి ధైర్యం చెప్పాలనే ఆరాటం నన్నలా అడిగించాయి.



నిర్మలకి తండ్రి లేడు. తల్లి ఒక్కతే వుంది. తను బియస్సీ ఫస్టియర్, తమ్ముడు టెన్త్ చదువుతున్నారు. ఇద్దరూ వాళ్ళ అక్క దగ్గర వుంటారు. ఆ అమ్మాయి మంచిదే! తమ్ముడినీ, చెల్లెల్నీ ప్రేమగానే చూస్తుంది. ఆమె భర్త అంటే నిర్మల బావకూడా, నిర్మల ద్వారా అతని గురించి నాకు తెలిసినంత వరకూ మంచి వ్యక్తిగానే కనబడుతున్నాడు. తను వదిలేస్తే ఆ పిల్లలిద్దరి చదువూ ఆగిపోయి ఎటూ కాకుండా పోతారని అతనికీ తెలుసు.

అయితే వచ్చిన సమస్యల్లా అతని తల్లి! ఆవిడని చూశాకే నాకు. చదువు అనేది మనిషిని విజ్ఞాన వంతుడ్ని చేయగలదేమోగాని సంస్కార వంతుడ్ని మాత్రం చేయలేదనే సత్యం అర్థమయింది. ఆవిడ స్కూల్ టీచర్‌గా చేసి రిటైర్ అయింది. ఆమెకి భర్త లేడు. వున్నదల్లా ఆ కొడుకొక్కడే. అతన్ని కష్టపడి తన శ్రమతోనే పెంచి పెద్దచేసి చదివించింది. ఒక్కగానొక్క కొడుకుపై ఆమెకి విపరీతమైన ప్రేమ వుండొచ్చు కాదనలేం! కానీ ఆమెకి తన కొడుకు సొమ్ముని ఆ పిల్లలిద్దరూ తినేస్తున్నారనే భయం, బాధ, ఈర్ష్య, అసూయ, అన్నీ ఎక్కువే! ప్రతిరోజూ ఆవిడ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, కొడుకునీ, కోడల్నీ ఈ విషయం మీద సాధిస్తూనే వుంటుంది.

నిర్మల బావకి చిన్నప్పటి నుండీ, తల్లీ, తండ్రీ, గురువూ, దైవం, అన్నీ తల్లే! ఆమెని బాధ పడడం అతను చూడలేడు. ఆమెని ఎదిరించలేడు. ఆమె లేకుండా వుండలేడు కూడా. ఆ బలహీనతని అడ్డు పెట్టుకునే కొడుకు మనసు మార్చాలని చూస్తోందామె.

నిర్మల అక్కని తన కొడుకు పెళ్ళి చేసు

కోవడం కూడా ఆమెకి ఇష్టం లేదు. అతను వాళ్ళ వూళ్ళో ఉద్యోగ రీత్యా వున్నప్పుడు నిర్మల వాళ్ళింటి పక్కనే అద్దెకుండేవాడట. నిర్మల వాళ్ళ అక్క అమాయకత్వం అతన్ని ఆకర్షించింది. ఆ అమ్మాయిని తప్పితే యింకెవర్నీ చేసుకోనని తల్లితో మొండికేసి తన పంతం నెగ్గించుకున్నాడు. కొడుకు కోరిక కాదనలేక అప్పుడామె సరేనంది. కాని ఇప్పుడీ పిల్లల బాధ్యత తన కొడుకు తీసుకోవడం ఓర్చుకోలేకపోతోంది. ఇదంతా నిర్మలద్వారా నాకూ తెలిసింది కొంతయితే నేను స్వయంగా వాళ్ళ ఎదురింట్లో వుండి చూస్తున్నది కొంత.

ఆ అమ్మాయిని ప్రశ్నడిగి జవాబు వినకుండా నా ఆలోచనల్లో నేనుండి పోయాను. నిర్మల ముభావంగా అలాగే వుంది. "ఏమ్మా మాటాడవూ!" మళ్ళీ అడిగాను. "ఏముంది మేడమ్. మామూలే!" అంత చిన్న పిల్ల కంఠంలో, అంతటి నిర్లిప్తతా, వైరాగ్యం వినిపించడం నాకే ఆశ్చర్యమనిపించింది. జీవితం కొందరికి చిన్న వయసులోనే పెద్ద పాఠాలు నేర్పుతుంది. నిర్మల కూడా అలాంటిదే అనిపించింది నాకు.

"మా బావ వాళ్ళమ్మ మాటలు విని ఇప్పుడు మమ్మల్ని వదిలేస్తే తమ్ముడూ, నేనూ ఏమయిపోతాం మేడమ్. ఇన్నాళ్ళూ అమ్మ రెక్కల కష్టం మీద ఆధారపడ్డాం. ఇప్పుడు ఆమెకా శక్తి కూడాలేదు. నాకు చదివింది కూడా అర్థం కావడం లేదు మేడమ్. ఆ తరువాత జీవిత మేమిటనే ప్రశ్న నన్ను తినేస్తోంది" నిర్మల కంఠం వణుకుతోంది. ఆ అమ్మాయికి జీవితం పట్ల వున్న అవగాహనకి, నేనే వూరడింపు మాటలు మాట్లాడినా తనని మభ్య పెట్టలేను. ఈనాడు స్త్రీ జీవితం ఇంత అస్తవ్యస్తంగా ఎందుకు తయారయిందో, తయారవుతున్నదో నాకిప్పుడు స్పష్టంగా కనబడుతోంది.

ఈ రోజు స్త్రీ అభ్యుదయం కోసం, స్త్రీ స్వేచ్ఛ కోసం, స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం కోసం ఎక్కడ చూసినా వినబడుతున్న ఉపన్యాసాలు గాని, ఉద్యమాలు గాని, ప్రభుత్వ వాగ్దానాలు, చట్టాలు, శాసనాలు ఏవీ - నా కాళ్ళ మీద నేను నిలబడేందుకు చేయూతనివ్వరా అని అర్థిస్తున్న ఒక ఆడపిల్లను ఆదుకోలేవు. ఇది నగ్న సత్యంలా కనబడుతోంది నా కళ్ళకి!

"పరిస్థితి అక్కడి వరకూ రాదులే నిర్మలా! ఊరికే భయపడకు. మీ బావ తల్లితో నేను మాటాడుతాలే" ఓదార్పుగా అన్నాను. అంతకంటే ఏమనాలో ఆ క్షణాన నాకర్థం కాలేదు. ఆ తరువాత రోజు క్లాసులు లేకపోవడంతో తొందరగా వచ్చేసాను ఇంటికి. నిన్న సాయంత్రం నిర్మలతో నేను చెప్పిన మాటలు గుర్తొచ్చి వెంటనే వాళ్ళింటికి బయల్దేరాను.


నేను ఇంట్లోకి వచ్చి నెల దాటుతున్నా నాకావిడతో ముఖ పరిచయమే తప్ప ఎప్పుడూ మాటాడలేదు. నన్ను చూసి సాదరంగా ఆహ్వానించిందావిడ. మామూలుగానే తనతోటి టీచర్‌తో మాటాడినట్టుగానే చాలా మాటాడింది. ఈవిడే కదా నిర్మల బాధకు కారణం అనుకుంటే చెప్పలేనంత ఆశ్చర్యమనిపించింది నాకు. మనిషిలో ఎంతటి ద్వంద్వ వైఖరి వుంటుంది? సమాజంలో నాగరికత అభివృద్ధి చెందడమంటే మనిషిలో మానసికమైన మార్పు కాదు! బయటి ప్రపంచంలో నాగరకంగా జీవించడంలో మాత్రమే ఆ అభివృద్ధి అందుకే మన సమాజంలో, నాగరికతా, అనాగరికతా నేటిదారి దేనిదారి అదే రైలు పట్టాల్లా సాగిపోతూనే వున్నాయి.

మరో పది నిమిషాల తరవాత అసలు విషయం కదిపాను. నిజానికి ఆ విషయం ఎలా ప్రస్తావించాలో నాకు తెలియడం లేదు. ఆవిడ చదువుకున్నది! అన్నీ తెలిసినది. అదే ఏ చదువు రాని అమాయకురాలికో అయితే చెప్పి ఒప్పించవచ్చు. కానీ ఈ పరిస్థితి!? నేను ప్రాధేయపూర్వకంగా చెప్పిందంతా మౌనంగా విన్నదామె. ఆ తరవాత "సారీ! ఇది మా కుటుంబ విషయం. అయినా ఇంత వరకూ వచ్చారు కాబట్టి నేను మీకో విషయం చెప్పాలి. నేను తల్లి ప్రేమ అంటే ఏమిటో తెలిసిన కన్న తల్లిని! నా కొడుకు గురించి ఆలోచించేప్పుడు నాకు బయటి ప్రపంచమంతా శూన్యంలా కనిపిస్తుంది. మీలా వున్న ఒక్క కొడుకుని అతనిదారి అతన్ని వదిలేసి ఒకే వూళ్ళో రెండో కాపురం పెట్టేంత ఆత్మస్థైర్యం లేదు నాకు. అంత స్వార్థం కూడా లేదు. నాలో ఏమనుకోకండి!" స్వార్థం అనే పదం నొక్కి పలుకుతూ చెప్పింది. నేను నిశ్చేష్టురాల్నయ్యాను.

ఆమె అన్న చివరి మాటలు నన్ను బాధించిన దానికంటే తల్లి మనసుకి, అమ్మ ప్రేమకి ఆమె ఇచ్చిన నిర్వచనం నన్ను ఎక్కువ ఆశ్చర్యపరచింది. నా మనసుని ముల్లులాంటి మాటతో గాయపరచానన్న సంతృప్తి ఆమె మొహంలో స్పష్టంగా కనబడుతోంది. "వస్తాను" అంటూ లేచాను. "చూడండి" పిలిచిందామె. "రిటైర్ అయ్యాక ఇంట్లో వుండాలంటే బోర్‌గా వుంది. పైగా మా అబ్బాయికి నా ఆర్థిక సహాయం కూడా పోయింది. మీకు తెలిసిన ప్రైవేట్ స్కూల్స్‌లో ఏవైనా టీచర్ పోస్టులుంటే నాకు చెప్పండి కొంచెం. తప్పదు! మా వాడి కోసం నేనింకా కష్ట పడాల్సిందే!" అంటూ నవ్వింది. ఆమె తన కొడుకుపై తనకున్న ప్రేమని నాకు

[తరువాయి 55 వ పేజీలో]

## కుమారి అరుణకు హిందీ భూషణ్‌లో గోల్డ్ మెడల్



హిందీ ప్రచారసభ హైదరాబాద్ వారు నిర్వహించిన హిందీ భూషణ్ పరీక్షలలో కుమారి ఎ.అరుణ 'గోల్డ్ మెడల్' సంపాదించింది. హైదాబాద్‌లోని పద్మావతీ మహిళా కళాశాలలో బి.ఎ. చదువుతున్న కుమారి అరుణ హిందీలో పిహెచ్.డి. చేయాలని అనుకుంటోంది. 1988లో కేరళ, ఆంధ్ర, మహారాష్ట్రంలో నిర్వహించిన ఈ పరీక్షలలో అరుణ గోల్డ్ మెడల్ సాధించడం తెలుగువారికి గర్వ కారణం.

### ఇది నిజం

ఫ్రాన్స్‌లో 'రెడెన్' తయారు చేసిన ఓ ఫౌంటెన్ పెన్ విలువ 1.3 మిలియన్‌ల FF. ఇది 1988లో జపాన్‌లో ఓ పెన్నుల అభిమాని కలక్ట్ చేశాడు. దీని కోసం పచ్చలు, కెంపులు, వైడూర్యాలు, నీలాలు 600 రాళ్ళు కావలసి వచ్చింది. దీనిని తయారుచెయ్యడానికి ఒక సంవత్సర కాలం పట్టిందట.

అరుణ.కె.

[47 వ పేజీ తరువాయి]

తెలియ జేసేందుకే ఆ మాటన్నదని నాకు తెలుసు!

ఇది జరిగిన రెండు రోజుల తరువాత నేను కాలేజికి శలవు పెట్టి ఆవిడని కలిసి చెప్పాను. "టీచర్ పోస్ట్లేమన్నా ఖాళీ వుంటే చెప్ప మన్నారుగా. నాకు తెలిసిన ఒక ప్రైవేట్ స్కూల్లో ఓ టీచర్ పోస్టు ఖాళీగా వుంది. మీరు వెడదామంటే యిప్పుడే బయల్దేరుదాం" అన్నాను. ఓ పది నిమిషాల్లో రెడీ అయి వచ్చిందామె. ఆటోలో వెళ్తున్నంత సేపూ యిద్దరం మౌనంగా వుండిపోయాం. ఆటో దిగి లోపలి కెళ్తున్నప్పుడు అడిగింది. "హాస్టల్ కూడా వుందా ఇక్కడ". "అవును. ఈ పిల్లలంతా అనాథులు! మూగవాళ్ళు!" చెప్పాన్నేను. ఆమె ఆశ్చర్యంగా చూసింది నా వైపు.

ఆమెని తీసుకుని హెడ్‌మాస్టర్ గదిలో కెళ్ళాను. మమ్మల్ని చూడగానే గబగబా లేచి చైర్స్ చూపిస్తూ "కూర్చోండి మేడమ్" అన్నాడాయన. నేను స్కూలు విషయాలు అడిగి తెలుసుకుంటుంటే ఆవిడ ఆశ్చర్యంతో మా వైపు చూస్తూ కూర్చుంది. ఆమెని హెడ్‌మాస్టర్‌కి పరిచయం చేసి చెప్పాను. టీచర్‌గా తీసుకోమని. లేచి బయటకొస్తున్నప్పుడు "ఈ స్కూలుకి మీకు వున్న సంబంధం" అంటూ ఆగిపోయిందామె. "ఇది నేను కట్టించిందే" ఆశ్చర్యంగా చూసిందామె.

"ఈ స్కూలు నా భర్త ఆశ, ఆశయం, జీవితం అన్నీ! ఆయన మూగవారు! అనాథ! కష్టపడి పైకి వచ్చిన మనిషి! మేమిరువురం ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాం. మా అమ్మా నాన్నల్ని ఎదిరించి మరీ! మాకున్నది ఒక్కడే కొడుకు. మా వారి జీవితంలో ఒకే ఒక కోరిక తనలా అనాథలైన, మూగపిల్లలకి ఓ స్కూలు కట్టించాలని! ఒక అనాథగా,! మూగవాడిగా ఆయన అనుభవించిన కష్టాలు ఆయనలో ఈ కోరికను ప్రేరేపించాయేమో!

మా అబ్బాయి డాక్టర్ చదువుతుండగా ఆయన పోయారు. ఆయన ఉద్యోగం తాలూకూ వచ్చిన డబ్బుతో పాటు మేమంత వరకు సంపాదించుకున్న ఆస్తులు మొత్తం అమ్మేసి నేనీ స్కూలు కట్టించాను అప్పుడే నేనీ పని చేయడం మా అబ్బాయికిష్టం లేదు. తనకు చెందవలసిన ఆస్తిని ఇలా అనాథలకు పంచి పెట్టడం వాడు సహించలేకపోయాడు. వాడు డాక్టరై, తన కాళ్ళపై తను నిలబడ్డాక నా నుండి ఇక పైసా లభించదని తెలుసుకుని నాకు దూరమై పోయాడు. అందుకు నేనేమీ బాధ పడడంలేదు. కన్నతల్లిగా వాడి మీద నాకు ప్రేమ వుంది. కానీ నాలో వున్న తల్లి మనసుకి ప్రేమించేందుకు వాడొక్కడే కొడుకు కాదు! వీళ్ళంతా నా పిల్లలే! తన పిల్లల్ని తను అమితంగా ప్రేమించే తల్లిది గొప్ప ప్రేమనుకోను నేను! అది కన్న కడుపు స్వార్థం అనిపిస్తుంది నాకు!"

ఆమె నా కళ్ళలోకి చూసి తల వంచుకుంది. "రేపే వచ్చి జాయినవ్వండి" చెప్పాన్నేను. తలెత్తి అలాగే నన్నట్టుగా తలూపిందామె! ఆమె మొహం ప్రశాంతంగా కనిపించింది. నా హృదయంలాగే!

### ఇది నిజం

'సుమిత్రా' దీవులలో విడాకులు కావాలనుకునే భర్త తమలపాకులను భార్య చేతిలో పెట్టి "తలాక్" అని మూడు సార్లు చెప్పితే వివాహం రద్దు అయినట్టు అర్థం!

– భరణీచంద్రశేఖర్
కర్నూలు

